# తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 5వ అధ్యాయము

## సంఘములోని వృద్ధులను విధవ రాండ్రను పరామర్శించుట

వృద్ధుని గద్దింపక తండ్రిగా భావించి అతని హెచ్చరించుము. 2 అన్నదమ్ములని యౌవనస్థులను, తల్లులని
వృద్ధస్త్రీలను, అక్కచెల్లెండ్రని పూర్ణ పవిత్రతో యౌవన స్త్రీలను హెచ్చరింపుము. 3 నిజముగా అనాధలైన
విధవరాండ్రను సన్మానింపుము. 4 అయితే ఏ విధవరాలికైనను పిల్లలు గాని మనుమలు గాని ఉండినయెడల,
వీరు మొదట తమ ఇంటివారియెడల, భక్తి కనపరచుటకును తమ తల్లిదండ్రులకు ప్రత్యుపకారము
చేయుటకును నేర్చుకొనవలెను ఇది దేవుని దృష్టికనుకూలమైయున్నది. 5 అయితే నిజముగా అనాధయైన
విధవరాలు ఏకాకియైయుండి దేవుని మీదనే తన నిరీక్షణనుంచుకొని విజ్ఞాపనలయందును ప్రార్థనలయందును
రేయింబవళ్ళు నిలుకడగానుండును. 6 సుఖభోగములయందు ప్రవర్తించునది బ్రతుకుచుండగానే చచ్చినదై
యుండును. 7 వారు నిందారహితులై యుండునట్లు ఈలాగు ఆజ్ఞాపించుము. 8 ఎవడైనను స్వకీయులను,
విశేషముగా తన యింటి వారిని సంరక్షింపక పోయిన యెడలవాడు విశ్వాస త్యాగము చేసిన వాడై
అవిశ్వాసికన్న చెడ్డవాడై యుండును. 9 అరువది ఏండ్ల కంటె తక్కువ వయస్సులేక, ఒక్క పురుషునికే
భార్యయై, 10 సత్ క్రియలకు పేరుపొందిన విధవరాలు పిల్లలను పెంచి, పరదేశులకు ఆతిథ్యమిచ్చి,
పరిశుద్ధుల పాదములు కడిగి, శ్రమపడువారికి సహాయము చేసి, ప్రతి సత్కార్యము చేయ బూనుకొనినదైతే
ఆమెను విధవరాండ్ర లెక్కలో చేర్చవచ్చును. 11 యౌవనస్థులైన విధవరాండ్రను లెక్కలో చేర్చవద్దు 12 వారు
క్రీస్తునకు విరోధముగా నిరంకుశలైనప్పుడు తమ మొదటి విశ్వాసమును వదులుకొనిరను తీర్పుపొందినవారై
పెండ్లాడ గోరుదురు. 13 మరియు వారు యింటింట తిరుగులాడుచు బద్ధకురాండ్రగుటకు మాత్రమే గాక
ఆడరాని మాటలాడుచు వదరుబోతులును పరులజోలికి పోవు వారగుటకును నేర్చుకొందురు. 14 కాబట్టి
యౌవన స్త్రీలు వివాహము చేసుకొని పిల్లలను కని గృహపరిపాలన జరిగించుచు, నిందించుటకు విరోధికి
అవకాశము ఇయ్యకుండవలెనని కోరుచున్నాను. 15 ఇంతకు ముందే కొందరు త్రోవనుండి తొలగి పోయి
సాతానును వెంబడించినవారైరి. 16 విశ్వాసురాలై ఏ స్త్రీ యింట నైనను విధవరాండ్రుండిన యెడల సంఘము
నిజముగా అనాధలైన విధవ రాండ్రకు సహాయము చేయుటకై దాని మీద భారము లేకుండా అమెయే వీరికి
సహాయము చేయవలెను.

17 బాగుగా పాలనచేయు పెద్దలను, విశేషముగా వాక్య మందును ఉపదేశమందును
ప్రయాసపడువారిని, రెట్టింపు సన్మానమునకు పాత్రులనుగా ఎంచవలెను. 18 ఇందుకు–నూర్చెడు యెద్దు
మూతికి చిక్కము వేయవద్దు అని లేఖనము చెప్పుచున్నది. 19 మరియు– పనివాడు తన జీతమునకు
పాత్రుడు. ఇద్దరు ముగ్గురు సాక్షులుంటేనే గాని పెద్ద మీద దోషారోపణ అంగీకరింపకుము. 20. ఇతరులు
భయపడు నిమిత్తము పాపముచేయువారిని అందరి యెదుట గద్దింపుము. 21. విరోధ బుద్ధితోనైనను
పక్షపాతముతోనైనను ఏమియు చేయక నేను చెప్పిన సంగతులను గైకొనవలెనని దేవుని ఎదుటను క్రీస్తుయేసు
యెదుటను ఏర్పరచబడిన దేవదూతల యెదుటను నీకు ఆనబెట్టుచున్నాను. 22 త్వరపడియెవని మీదనైనను
హస్తనిక్షేపణము చేయకుము, పరుల పాపములలో పాలివాడవై యుండకుము. నీవు పవిత్రుడుగా ఉండునట్లు
చూచుకొనుము. 23 ఇక మీదట నీళ్ళే త్రాగక నీ కడుపు జబ్బు నిమిత్తమును తరచుగా వచ్చు బలహీనతల

కోసరమును ద్రాక్షారసమును కొంచెముగా పుచ్చుకొనుము. 24 కొందరి పాపములు తేటగా బయలుపడు
న్యాయపు తీర్పునకు ముందుగా నడుచుచున్నవి, మరి కొందరి పాపములు వారి వెంట వెళ్ళుచున్నవి. 25
అటువలె మంచి కార్యములు తేటగా బయలుపడుచున్నవి, బయలుపడనివి దాచబడనేరవు.